క్లుప్తంగా

కుకింగ్ ఏజెన్సీ తొలగింపు

అర్ధవీడు (బేస్తవారిపేట): అర్ధవీడు మండలం మాగుటూరు జెడ్పీ హైస్కూల్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో ఏన్నో ఏళ్లుగా పనిచేస్తున్న కుకింగ్ ఏజెన్సీని తొలగించారు. కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు ఇప్పర్ల లక్ష్మమ్మ, హెల్పర్ సరోజ, స్వీపర్‌ను, పంచాయతీ గ్రీన్ అంబాసిడర్లు ముగ్గురిని తీసేశారు. బడుల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైనప్పటి నుంచి పని చేస్తున్న వారిని అన్యాయంగా తొలగించారని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి పనులతో జీవనం సాగించే కుటుంబాలను రాజకీయాల పేరుతో ఇబ్బందులు పెట్టడం సమంజసం కాదని, నెలల తరబడి జీతాలు రాకపోయినా కష్టపడి పని చేసుకుంటున్నామన్నారు.

శానిటరీ కార్మికులకు జీతాలు చెల్లించాలి

కంభం: స్థానిక 50 పడకల ప్రభుత్వ వైద్యశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని శనివారం కలెక్టర్, ఏపీవీవీపీ జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయంలో వినతి పత్రాలు ఇచ్చినట్లు షెడ్యూల్డు కులాల పరిరక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కాటమాల చెన్నకేశవరావు తెలిపారు. ఆరు నెలలుగా జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ వైద్యశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. కాంట్రాక్టర్ బిల్లులు చెల్లించక పోవడంతో చిన్నపాటి జీతాలతో జీవనం సాగించే ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

జార్జి బీఫార్మసీలో నూరు శాతం ఉత్తీర్ణత

మార్కాపురం టౌన్: గత జూలైలో నిర్వహించిన బీఫార్మసీ చివరి సంవత్సరం 8వ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని శ్యామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాల విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని తెలిపారు. మొత్తం 92 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని, వీరిలో 32 మంది డిస్టింక్షన్‌లో పాసయ్యారని, మిగిలిన 60 మంది ఫస్టు క్లాసులో పాసయ్యార చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డైరెక్టర్ సతీష్ అభినందించారు. వై.సునీత, డాక్టర్ అశోక్, ముజీబ్, భాస్కర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో వరుసగా 2వ రోజు ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. కొమరోలు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ లైన్‌లో కొత్త లైన్ వేస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. చింతలపల్లె ఫీడర్ పరిధిలోని హనుమంతరాయునిపల్లె, కొత్తపల్లె, మలికేపల్లె, ఓబులాపురం, కూరాకువానిపల్లె, వర్ధనపల్లె, చింతలపల్లె గ్రామాలకు శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామన్నారు.



వైద్యులకు రక్షణ కల్పించాలి:
ఇటీవల కాలంలో రోగుల బంధువులు విధుల్లో ఉన్న డాక్టర్లపై దాడులు చేయడం ఆందోళన కలిగిస్తోంది. డాక్టర్లు ప్రాణాలు కాపాడుతారే కానీ తీయరు. కోల్‌కత్తాలో డాక్టర్‌పై హత్యాచార ఘటన చాలా దారుణం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు అమలు చేయడంతో పాటు నిందితులకు మరణశిక్ష పడేలా చర్యలు తీసుకోవాలి.
డాక్టర్ కనకదుర్గ, మార్కాపురం



వైద్యశాలల వద్ద పోలీసులు ఉండాలి:
ప్రభుత్వ వైద్యశాలల వద్ద పోలీసు రక్షణ కల్పించాలి. వైద్యులపై ఎవరైనా దాడులు చేస్తే వారిపై నాన్‌బెయిల్ బుల్ కేసులు నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలి. దేశం, రాష్ట్రంలో కోల్‌కత్తా వంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. హాస్పిటల్స్ అంటేనే వివిధ రకాల రోగులు, వ్యక్తులు వస్తారు. ఎవరు ఎలాంటి వారో అర్థం కావడం లేదు. పోలీసు సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.
డాక్టర్ బి.శరత్, ఈఎస్ఐ హాస్పిటల్, మార్కాపురం

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు



కంభం: వాసవీ విద్యానికేతన్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థినులు



సాయి బాలాజీ హైస్కూల్లో కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో చిన్నారులు



కొమరోలు: కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



వాసవీ విద్యానికేతన్‌లో ఉట్టి కొడుతున్న చిన్నారులు



కంభం: గౌతమి స్కూల్లో..

మార్కాపురం: పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల ఆధ్వర్యంలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 26వ తేదీన కృష్ణాష్టమి (జన్మాష్టమి)ని పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాలాజీ హైస్కూల్, వికాస్, వాసవీ విద్యానికేతన్‌లో చిన్నారులను కృష్ణుడు, గోపిక వేషధారణల్లో అలంకరించి ప్రదర్శనలు చేయించారు. పలువురితో ఉట్టి కొట్టించారు. సాయిబాలాజీ హైస్కూల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకల్లో కృష్ణుడు, రాధ, గోపికల వేషాలు వేయించి తల్లిదండ్రుల సమక్షంలో పూజా కార్యక్రమాలు కరస్పాండెంట్ పి.ప్రకాష్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్ రంగయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సాయి వికాస్‌లో కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ చలం ఆధ్వర్యంలో నిర్వహించారు. కమలా హైస్కూల్లో శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సుమారు 100 మందికిపైగా విద్యార్థినీ, విద్యార్థులు గోపిక, కృష్ణుని వేషధారణల్లో పాల్గొన్నారు. కరస్పాండెంట్ పి.పవన్ కుమార్, హెచ్ఎం ఎంపీ పుల్లయ్య ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అరవింద్ విద్యానికేతన్‌లో ప్రిన్సిపాల్ వాణి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

గిద్దలూరు రూరల్: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వివిధ భక్తి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం విశ్వక్షేనారాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, విష్ణు సహస్రనామ పఠనం, 26వ తేదీన స్వామివారి కల్యాణ మహోత్సవం, భక్తులకు అన్నదానం, గ్రామోత్సవం, కోలాటం ప్రదర్శన, 27వ తేదీన సుదర్శన హోమం, సుప్రభాత సేవ, కుంకుమార్చన వంటి భక్తి కార్యక్రమాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

కొమరోలు: స్థానిక ఎస్‌బీఎన్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో శనివారం చిన్నారులచే ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు కృష్ణుడు, గోపికల వేషధారణ వేయించి వారిచే కృష్ణభగవానుని పాటలకు నృత్యాలు చేయించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి శ్రీకృష్ణాష్టమి విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు బందుగుల సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంభం: పట్టణంలోని వాసవీ విద్యానికేతన్, గౌతమి విద్యాసంస్థల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీక్రిష్ణుడి, గోపికల వేషధారణలు వేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల సందడితో పాఠశాలల్లో కోలాహలం నెలకొంది. ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో వాసవీ విద్యాసంస్థల చైర్మన్ గోళ్ల సుబ్బరత్నం, డైరెక్టర్ కల్పన, గౌతమీ విద్యాసంస్థల చైర్మన్ చేగిరెడ్డి భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ఓంకార్



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బాలాజీ



సబ్‌జైలులో ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న బాలాజీ

మార్కాపురం: వచ్చే నెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని మార్కాపురం కోర్టు సముదాయంలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ పోలీసు అధికారులకు సూచించారు. శనివారం కోర్టు హాలులో సెప్టెంబరు 14న జరిగే లోక్ అదాలత్‌పై ఆయా కేసుల్లో ఉన్న కక్షిదారులకు తెలపాలని, రాజీకి వచ్చే కేసుల విషయంపై వివరించి లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకునే విధంగా చూడాలన్నారు. లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతుందనే విషయాన్ని చెప్పాలన్నారు. ఇరువర్గాలు ఇష్టపడి రాజీ పడితే లోక్‌అదాలత్‌లో కేసును కొట్టివేస్తారని పేర్కొన్నారు. పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్‌కు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ శనివారం మార్కాపురం సబ్ జైలును సందర్శించారు. నిందితులు కేసుల వివరాలు తెలుసుకున్నారు. నేర ప్రవృత్తి వీడాలని, వాయిదాలకు సక్రమంగా హాజరవ్వాలని, జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత నేర ప్రవృత్తి మాని కుటుంబ సభ్యులతో కలిసి జీవనోపాధి చూసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈయన వెంట న్యాయ సహాయ సేవకుడు ఎస్‌కే బాషా, పోలీసు అధికారులు, పలువురు ఎస్సైలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై కక్షిదారులకు అవగాహన కల్పించాలని గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ సూచించారు. లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించే సందర్భంగా నియోజకవర్గంలోని పోలీసు అధికారులతో శనివారం కోర్టు భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ తమ కేసులను సత్వరమే పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. 14వ తేదీన నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రతి ఒక్క కక్షిదారుడు సద్వినియోగం చేసుకునేలా పోలీసు అధికారులు పనిచేయాల్సి ఉంటుందన్నారు. అన్ని రకాల సివిల్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రాజీ పడాల్సిన క్రిమినల్ కేసులు, వంటి వాటిని సత్వరమే పరిష్కరించుకోవచ్చని వివరించారు. గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీసారాధానమ్మ, సీఐలు, ఎస్సైలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

బేస్తవారిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతన తహసీల్దార్‌గా ఏ.జితేంద్రకుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఎర్రగొండపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బేస్తవారిపేట మండల తహసీల్దార్‌గా నియమితులయ్యారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి, రెవెన్యూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్‌ను శాలువ, పూలమాలలతో డీటీ, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు సన్మానించారు.

గిద్దలూరు రూరల్: మాచర్ల నుంచి గిద్దలూరు నగర పంచాయతీకి కమిషనర్‌గా బదిలీపై వచ్చిన వెంకటదాస్ శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, నగర పంచాయతీ కార్యాలయం ఉద్యోగులు, సిబ్బందితో పాటు బీజేపీ నాయకుడు పిడతల రమేష్‌రెడ్డిలు ఆయనకు శాలువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించేందుకు ఫోన్ నంబరు ఏర్పాటు చేసి వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

బేస్తవారిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా ఎస్‌వీ రవీంద్రారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల జిల్లా నుంచి బదిలీపై బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి పోలీసులు అభినందనలు తెలిపారు.

చెన్నకేశవస్వామికి శాంతి పూజలు



భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవ స్వామి మూలవిరాట్

మార్కాపురం టౌన్: శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి వారికి శనివారం ప్రత్యేక శాంతి పూజలు అర్చకులు నిర్వహించారు. చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం అభిషేకాలు, అర్చన తదితర పూజలను నిర్వహించింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

కంభం రోడ్డులోని శ్రీ ప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం సందర్భంగా స్వామివారిని ప్రత్యేక పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

వికలాంగులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ



ఎంఈఓ వెంకటరత్నం ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌టీలు

కొమరోలు: ప్రత్యేక అవసరాల పిల్లలు జీవన నైపుణ్యాలను నేర్చుకునేందుకు శిక్షణ ఇస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బొర్రా వెంకటరత్నం తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారికి శనివారం జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇళ్ల వద్దే విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల పిల్లలకు తల్లిదండ్రుల సమక్షంలోనే ఐఈఆర్‌టీలు శ్రీనివాసరెడ్డి, సరస్వతి శిక్షణ ఇచ్చారు.

పోలీసులకు ప్రజలు సహకరించాలి



ట్రాఫిక్ సమస్యపై మాట్లాడుతున్న సీఐ



ఆటో డ్రైవర్‌కు కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్సై

కంభం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ప్రజలు, వ్యాపారులు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్సై బి.నరసింహారావు సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని కందులాపురం కూడలి, బస్టాండ్‌లో వాహనాల తనిఖీ చేశారు. రద్దీగా ఉండే వ్యాపార కూడలీల్లో దుకాణదారులు ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తమ వస్తువులు ఉంచుకోవాలని సూచించారు. ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సీఐ సురేష్ అన్నారు. గిద్దలూరు అర్బన్ సీఐ శనివారం పట్టణంలోని రాచర్ల గేటు సెంటర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలు నడిపే సమయంలో కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. రోడ్లపై అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ప్రవర్తించడంపై ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. వాటిని నివారించేందుకు తగు జాగ్రత్తలు, సూచనలు వ్యాపారులకు తెలియజేశారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

గిద్దలూరు రూరల్: మండలంలోని సంజీవరాయుడుపేట గ్రామానికి చెందిన కొమ్మునూరి అబ్బయ్య అనే వ్యక్తి ఈ నెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ కె.సురేష్ శనివారం తెలిపారు. ఇటీవల అబ్బయ్య మానసిక పరిస్థితి సక్రమంగా లేకుండా ప్రవర్తిస్తున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పశుపోషకులకు సన్మానం



పశుపోషకులకు సన్మానం చేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: బలరామ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు శనివారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో పశుపోషకులకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు పిడతల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ బలరామ జయంతి సందర్భంగా గోవును సంరక్షించే వారికి సన్మానం చేస్తూ వారిని గౌరవిస్తున్నామన్నారు. పూర్వం భారతదేశంలో ప్రధానంగా గో సంతతికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చేవారన్నారు. అటువంటి గోవులను పశువులను సంరక్షించే వారికి సన్మానం చేయడం మన కనీస ధర్మంగా భావిస్తున్నామన్నారు. ఈ నెల 7వ తేదీన గోవులు ఒక కంటైనర్‌లో వధించేందుకు వెళ్తున్న సమయంలో వాటిని గుర్తించి పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచామన్నారు. వాటిని సంరక్షించే పశుపోషకులకు ప్రధానంగా సన్మానం చేస్తున్నామని తెలిపారు. బలరాముడు పశువుల పై అమిత ప్రేమానురాగాలు చూపేవాడన్నారు. అందుకు ప్రతీకగా పశుపోషకులకు సన్మానం చేస్తున్నామన్నారు. దేవాలయాల కమిటీ సభ్యులు ఎర్రారెడ్డి, కృష్ణారావు, శివాపురం మురళి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పోస్టల్ శాఖ స్కాలర్‌షిప్‌లు

మార్కాపురం: పోస్టాఫీసుల్లో పోస్టల్ స్టాంప్స్‌ను సేకరించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని మార్కాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జీవీ శ్రీనివాస్ తెలిపారు. తపాలాశాఖ పోస్టల్ స్టాంప్స్ సేకరణను ప్రోత్సహించేందుకు దీన్ దయాల్ హర్ష యోజన అనే కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకం కింద పోస్టల్ స్టాంప్స్‌ను సేకరించే 6,7,8 తరగతులు చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తామన్నారు. ఈ ప్రక్రియ రెండు దశల్లో ఉంటుందని, రాత పరీక్ష, ప్రాజెక్టు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు కచ్చితంగా గుర్తింపు పొందిన పాఠశాలలో చదవాలన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతినెలా 500 రూపాయల ప్రకారం సంవత్సరానికి 6 వేల రూపాయలు అందించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించు కోవాలని, పూర్తి సమాచారం కోసం దగ్గరలోని పోస్టాఫీసును సంప్రదించాలని కోరారు.

అక్రమ లేఔట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు

దర్శి: అక్రమ లేఔట్లలో లావాదేవీలు నిర్వహిస్తే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ హెచ్చరించారు. ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆదేశాల మేరకు దర్శి నగర పంచాయతీలో వేసిన పలు లేఔట్లను నగర పంచాయతీ అధికారులు అక్రమమైనవిగా గుర్తించి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై ఎలాంటి లావాదేవీలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. ఆ లేఔట్లలో ప్లాట్లు, స్థలం కొనుగోలు చేయటం చట్ట విరుద్ధన్నారు. స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడం సాధ్యం కాదన్నారు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయరని కమిషనర్ స్పష్టం చేశారు.